


# ఆత్మీయత

— జి. సత్యం

ఆకాశం మబ్బు తీసుకొంటుందే కానీ - చినుకు పడటం లేదు. వెన్ను పైరు ఎండి పోతోంది. ఆఖరి తేదీ నీళ్ళు పోసేస్తే- కలో గంజో తాగొచ్చు. లేకుంటే ఏం తాగి బతుకుతాం...?' తనకు తాను చెప్పుకొన్నట్టు నాతో అన్నాడు మా నాయన.

ఆయన మాటల్లోని అర్థం నా కర్థమయి పోయింది. పొలానికి నీరు పోసేందుకు రమ్మని తెలియజేయడం ఆ మాటల్లోని పరమార్థం.

కష్టాన్ని నమ్ముకుని బ్రతికే వాళ్ళలో మా నాన్న మొదటి వాడు. తను కష్టం చేస్తూ... చేతనయినంత వరకూ నన్ను చదివించాడు. చదువు పూర్తయి, పొలం పని చేతకాక, ఉద్యోగం రాక, ఎందుకూ పనికి రాకుండా పోతున్నానన్న దిగులు నాకన్నా మా నాయనకే ఎక్కువగా వుందని చెప్పాలి.

అహర్నిశలు పొలంలో చెమటోడ్చి, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొంటూ... కుటుంబము లోని కష్ట నష్టాలు తట్టుకొంటున్నాడంటే - ఆయన గుండె నిబ్బరానికి జోహార్లు అర్పించాలి. వృద్ధాప్యం మీద పడి మునుపటి కష్టం చేయలేక పోయినా... ఈ పని చేయి అని ఆయన నన్ను పిలవలేదు ఇంతవరకూ...!

ఇంట్లో అమ్మా అన్నా..."చదువు కొన్నావు. రేపు పెళ్ళి చేసుకొంటావు. ఉద్యోగం ఏమో రాక పోయె- కష్టం చేయటం చేతకాక పోయె - రేపు పెళ్ళానికి

**న్యూజెర్సీ కథల పోటీలో 150 రూ.లు గెలుచుకున్న రచన**

కాసిన్ని మల్లెపూలు తేవాలన్నా... ఎవర్ని దేబిరిస్తావు బిడ్డా...?" అంటూ తనకు తోచిన నీతి వాక్యాలు చెపుతోంది.

"రెక్కల కష్టం నమ్ముకుంటే - ఎక్కడయినా బతికేయొచ్చు. మన పని మనం చేసుకొంటే తప్పే ముంది...? దొంగిలిస్తే తప్పు. వ్యభిచారం చేస్తే తప్పు. ఎవరికయినా ద్రోహం చేస్తే తప్పు. ఇతరుల సొమ్ముకి ఆశపడ్తే తప్పు. మనపని మనం చేసుకొంటే ఏం తప్పు?" ఎప్పుడూ పోరుతుంది.

ఆమె మాటల ధాటికి తట్టుకోలేక ఇంట్లో నుంచి వెళ్ళిపోతుంటాను. నేను ఆమె నుంచి తప్పుకొన్నా... ఆమె మాటల్లోని నిజం నన్ను వెంటాడుతూనే వుంటుంది.

నిజమే - ఆమె చెప్పేదాంట్లో తప్పేముంది...? ప్రతి ఒక్కరు చదువుకొంటున్నారు. చదువుకొన్న ప్రతి ఒక్కరూ... ఉద్యోగం కోసం ఎగబడుతున్నారు. ఎగబడిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగం కేటాయించాలంటే ప్రభుత్వం ఎక్కడికి వెళ్ళాలి...? ఆ విషయాన్ని విస్మరించి ప్రభుత్వాన్ని దుయ్యబట్టడం, చొక్కా నలగకుండా... క్రాపు చెదరకుండా... కాళ్ళాడించి డబ్బు సంపాయించాలని చూడడం ఏం న్యాయం...? ఆలోచిస్తూ వుంటాను.

"ప్రభుత్వం ప్రతి ఒక్కరూ చదువుకొని విజ్ఞానవంతులు కమ్మని కోరుకొంటుందే కానీ - చదువుకొన్న వారిని కష్టపడ వద్దని చెప్పటం లేదే - చదువు కొన్న వారే - తాము చదువుకొన్నాం... చదువుకొన్న తరువాత తామెందుకు కష్టపడాలి? అన్న ఆలోచనతో సోమరి పోతులయి పోతున్నారు. అసలు కష్టంలో వున్నంత 'సుఖం' ఎక్కడ వుంది?" ఆలోచించాను.

పొలం పనికి తండ్రితో వెళ్ళటానికి నిశ్చయించు కొన్నాను. అదే మాట తండ్రితో అన్నప్పుడు ఆయన పైకి ఏమీ అనకపోయినా... లో లోపల మాత్రం బాధ పడ్డాడు. "వీడ్ని చదివించి - కష్టపెడుతున్నానే" అన్న బాధ కాబోలు అది!

యంత్రాలు వచ్చిన తరువాత మనిషి శ్రమించడం చాలా వరకు తగ్గింది. మా పొలం పొరుదలకు మాత్రం యంత్రాలు ఉపయోగించ కూడదు. అది మా ఊరు కట్టుబాటు. ఆ విషయం తెలియక మా నాన్నతో అన్నాను. "ఇంజన్ పెట్టుకొని పొలం తడుపుకోవడం మంచిది కదా... రాత్రింపగళ్ళు 'ఏతాం'తో కష్టపడడం ఎందుకని...?"

ఆయన చిన్నగా నవ్వాడు. "ఈ యంత్రాలు వచ్చే మనిషిని సోమరిపోతును చేస్తున్నాయిరా... మనిషి రోజంతా పడే కష్టం. యంత్రం అరగంటలో చేయ వచ్చు. అయితే "వ్యవసాయదారులు ఈ యంత్రాల్ని నమ్ముకొంటే వారి నోట్లోకి తిండికి బదులు యంత్రాలు వదిలే పొగవెళుతుంది." మొదట వర్షాభావం వల్ల చెరువులో నీరు అంతంత మాత్రంగా వున్నాయి. ఈ సమయంలో "ఇంజన్ పెడితే నెల రోజులు వచ్చేనీరు, ఒక్క రోజులోనే అయిపోతాయి. మనిషి అప్పుచేసో... బదులు చేసో... తనను తాను తాకట్టు పెట్టో... ఆయిల్ రూపంలో డబ్బు ఖర్చు చేస్తే - ఆ తరువాత అతనికి మిగిలేది ఏమిటి?" ఆయన నెరిసిన వెంట్రుకల్లో అనుభవం అప్పుడు తెలిసింది నాకు.

మాట్లాడకుండా 'ఏతాం'తో నీళ్ళు పోయటానికి సిద్ధమయ్యాను.

'ఏతాం' తొక్కాలన్నా - అలవాటు లేదు. నీళ్ళు పోయాలన్నా చాతకావడం లేదు. అనుభవం వుంటే గా... సర్కస్ చేసినట్లు వుంది!

చాలా సేపు తంటాలుపడిన తరువాత ఇక లాభం లేదనుకొని, 'బానకడవకి' తాడుకట్టి, 'లాగుడు బాన' రూపంలో నీళ్ళపోత పోద్దామని నిశ్చయించుకొన్నాం.

'లాగుడు బాన' అంటే తాడు పట్టుకొని ఒకరు లాగుతుంటే - ఇంకొకరు నీళ్ళు పోయటం అన్న మాట... ఇలా చేయటం, లాగే వారికి తేలికే కానీ... పోసే వారికి కాసేపటికే 'నడుం నొప్పి' పుట్టుకొస్తుంది. ఆ నడుం నొప్పి లేకుండా వుండటానికీ, లోగా వున్న నీరు బైట తోడటానికి వీలుగా... 'రైతు సైంటిస్టులు' 'ఏతాం' తయారుచేశారు. అది తొక్కడం నాకు చేత కాకపోయె!

రెండు రోజులు అలాగే కష్టపడ్డాం. కష్టంలో సుఖం అప్పుడు తెలిసొచ్చింది నాకు. నాకెక్కువ కష్టం లేకుండానే మా నాన్న కష్టపడుతున్నా... ఆ చిరుకష్టానికి కడుపు నిండా తిండి తినడం, కంటి నిండా నిద్రపోవడం 'ఆయి' అనిపించింది నాకు.

ఇక ఒక్క రోజు కష్టపడితే మా పొలం అంతా తడిసి పోతుంది. కొత్తగా నీళ్ళలో వుండడం మూలాన శరీరంలో నెమ్మ చేరి 'జ్వరం' వచ్చినట్లుగా వుంది. ఆ విషయం చెపితే మా నాన్న పొలం వద్దకు వద్దంటాడని... చెప్పకుండానే ఆయనతో పాటు వెళ్ళాను.

మామూలు పద్ధతిలోనే తాడు లాగుతున్నాను. మా నాన్న 'బాన' పోస్తున్నాడు. నాకు కష్టం లేకుండానే మా నాన్నే నీళ్ళల్లోంచి బానను లేపుకుని నీళ్ళోంచుతున్నాడు. నాకప్పుడో విషయం అర్థమయింది. "కష్టపడే వారికి ఇతరుల కష్టం తెలుస్తుంది. అంతేకాదు కష్టపడే వాడు ఇతరుల్ని కష్టపెట్టాలని చూడడు." నేను అలిసానని మా నాన్న తెలుసుకొని నాకు కష్టం లేకుండా చూస్తున్నాడు.

ఒంట్లో జ్వరం మూలానా సూర్యుని ప్రతాపానికి నేను తాళలేక పోతున్నాను. ఎలాగో ఓర్చుకుని బానను లాగుతున్నాను. ఇక వంద కడవలకి 'కయ్య' పారుతుంది. అనగా... నా కళ్ళు తిరిగాయి. చేతులలో తాడు వదిలేసాను.

నేను తాడు వదిలేయడంతో... మా నాన్న వెల్లకిల్లా నీళ్ళలో పడిపోయాడు. నేనూ కాలువలోపడిపోయాను.

నా కంత దెబ్బతగల్లేదు. మా నాన్నకి గట్టి దెబ్బే తగిలింది. ఊపిరి తిత్తులలో నీళ్ళు కూడా చేరాయి. అవేమీ ఆయన పట్టించుకోలేదు. "ఏరా దెబ్బ తగిలిందా...?" అంటూ నన్ను స్పర్శించాడు.

ఆయన స్పర్శ నన్ను ఉలిక్కి పడేట్టు చేసింది. కారణం ఆయన ఒళ్ళు కాలిపోతూ వుంది. అంత జ్వరంతో... ఆయన నాకు కష్టం తెలియకుండా... కష్టంలో సుఖం వెతుక్కొంటూ... బ్రతకటానికి ఇన్ని తిండి గింజల కోసం శ్రమిస్తున్నాడంటే - నా కళ్ళు చెమ్మగిల్లాయి. ఆయన 'ఆత్మీయత'కి నేను మూగబోయాను. ●